

సోమశిలలో 35.888 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 35.888 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2,661 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.63,370
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,690
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,861
నవర (8 గ్రా)	- రూ.46,888

గరిష్టం/కనిష్టం
30.6 /23.9

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 66 శాతం ఉంది. మంగళవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

• ఎన్‌సీఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి

వెంకటాచలం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఎన్‌సీఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి సూచించారు. వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవా రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.మధుసూదన్, హెచ్‌ఎం బి.లత, విద్యాశాఖ మండల సమన్వయకర్త టి.బాబు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ పొడిగింపు

నెల్లూరు(లీగల్): నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కుల చట్టం రద్దు చేయాలంటూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ మెజారిటీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు విధుల బహిష్కరణతోపాటు ఈ నెల 13న కలెక్టరేట్ వరకు న్యాయవాదులు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో రిలే దీక్షలు చేపట్టేలా బార్ అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు న్యాయవాదులు సహకరించాలని కోరారు.

దుర్భిక్షం వీడి సుభిక్షం

- నాలుగున్నరేళ్లుగా విస్తారంగా వర్షాలు
- ప్రతి ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు, మద్దతు ధర
- రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

గత ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ రైతులను నిరుత్సాహ పరిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా సమృద్ధిగా వర్షాలు కురిసి సాగు విస్తీర్ణం, పంట దిగుబడులు పెరగడంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రబీ సాగు నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులు తీరిక లేకుండా ఉన్నారు.



గతంలో అలా..
ఇప్పుడు ఇలా..



జోరుగా వరినాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

తోటపల్లిగూడూరు: గత ప్రభుత్వంలో దుర్భిక్ష పరిస్థితులతో కొట్టుమిట్టాడిన రైతులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుభిక్షంగా జీవిస్తున్నారు. గత నాలుగున్నరేళ్లుగా వర్షాలు విస్తారంగా కురిసి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, ఇతర నీటివనరులు కళకళలాడాయి. రైతన్నలు ఏటా మంచి దిగుబడులు సాధిస్తుండగా, ఆ ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుండడంతో అన్నదాతల ఇంట సిరులు కురుస్తున్నాయి. తాము పండించిన ధాన్యానికి మంచి ధర లభించడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

గత టీడీపీ ప్రభుత్వంలో 2015లో జిల్లాలో 4.5 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చినప్పటికీ మిగిలిన సంవత్సరాల్లో రబీలో 2 లక్షల ఎకరాలు, ఖరీఫ్‌లో 90 వేల ఎకరాలకు మించి సాగులోకి రాలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏటా సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లో నీరు సమృద్ధిగా చేరి వరి సాగు గణనీయంగా పెరిగింది. 2019లో 5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, 2021–22లో రబీలో 6.12 లక్షల ఎకరాలు, ఖరీఫ్‌లో 1.75 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. ఈ ఏడాది వర్షాలు కాస్త ఆలస్యమైనప్పటికీ ప్రస్తుత రబీలో అధికారికంగా 2 లక్షల ఎకరాలకు అధికారులు నీరు అందిస్తుండగా, అనధికారికంగా మరో లక్ష ఎకరాలు సాగులోకి రానుంది.

రైతు సంక్షేమమే ధ్యేయంగా..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి నిధిని అందిస్తున్నారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు(సబ్సిడీపై), ఎరువులు, పురుగుమందులను రైతులకు అందిస్తున్నారు. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన అన్నదాతలకు పంట నష్టపరిహారం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. మిల్లర్లు సిండికేట్ అయి రైతులను దోచుకోకుండా రైతుభరోసా కేంద్రాల పరిధిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తుండడం అన్నదాతల పాలిట వరంగా మారింది.

జోరుగా రబీ సాగు పనులు

ప్రస్తుతం జిల్లాలో రబీ వరి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాలు కాస్త ఆలస్యమై సోమశిలలో నీరు సమృద్ధిగా లేకపోయినప్పటికీ మొదటి పంట రబీకి పెన్నా డెల్టా కింద దాదాపు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా జిల్లా అధికారులు ఐఏబీ సమావేశంలో నిర్ణయించి ప్రకటించారు. ఈ క్రమంలో నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతన్నలకు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కొంత ప్రయోజనం చేకూర్చాయి. అన్నదాతలు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ప్రస్తుతం జిల్లాలో ఏ ప్రాంతాన్ని చూసినా వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా కన్పిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో గత నాలుగేళ్లలో వరి సాగు, దిగుబడి

సంవత్సరం	ఖరీఫ్ సాగు (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)	రబీ సాగు (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2019–20	16,607	1,01,958	2,15,725	15,26,902
2020–21	52,223	3,33,481	2,24,307	15,69,902
2021–22	69,911	4,46,032	2,24,776	17,13,432
2022–23	72,435	4,82,235	2,28,175	18,28,172

రైతుకు పండగే



గత ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ రైతులను నిరుత్సాహ పరిచింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. పలు సంక్షేమ పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు.

– వెంకటకృష్ణయ్య, రైతు, మండపం, తోటపల్లిగూడూరు మండలం

అన్నదాతల కలలు పండాయి



ప్రస్తుత ప్రభుత్వంలో రైతుల కలలు నిజమవుతున్నాయి. రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. ఇలాంటి మంచి సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రభుత్వం గతంలో లేదు.

– మన్నెం చిరంజీవులుగౌడ్, రైతు, తోటపల్లిగూడూరు

పూర్తి సహకారం అందిస్తాం

రబీ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు వ్యవసాయ పరంగా పూర్తి సహకారాన్ని అందిస్తున్నాం. ప్రతి గ్రామంలో రబీ సాగు సంబంధించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అలాగే సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేయడంతోపాటు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు సిద్ధంగా ఉంచాం. ఆర్బీకేల ద్వారా సంక్షేమ పథకాలను రైతులకు నేరుగా చేరవేస్తున్నాం.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

భూ సమస్యల పరిష్కారానికి చారిత్రాత్మక నిర్ణయాలు



మహిళా రైతుకు భూ పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ఏళ్ల తరబడి నుంచి పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న కమ్యూనిటీ హాల్‌లో సోమవారం వెంకటాచలం మండలానికి సంబంధించి అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు, చుక్కల భూములకు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన భూములు మొత్తం 2,193 ఎకరాలకు సంబంధించి 2041 మంది లబ్ధిదారులకు భూ పట్టాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేయాలనే ఆలోచనతోనే ఎన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న అన్నదాతలకు హక్కులు కల్పించేందుకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పేద రైతులకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి సుమారు 6,691 మంది రైతులకు 8,094 ఎకరాలకు భూ పట్టాలు ఇస్తుండగా, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 5,445 ఎకరాలకు సంబంధించి అన్నదాతలకు పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

రైతు ద్రోహి సోమిరెడ్డి

ఎన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు భూ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తుంటే టీడీపీ నేత సోమిరెడ్డికి కడుపు మండిపోతోందని మంత్రి కాకాణి విమర్శించారు. రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే సోమిరెడ్డి ఒక్కడికే బాధ కలుగుతుందన్నారు. సైదాపురంలో క్వార్ట్జ తవ్వకాలకు తానే కారణమంటూ ఆరోపించిన సోమిరెడ్డి 24 గంటల లోపే చలో సైదాపురం ఉద్యమానికి స్వస్తి పలకడం వెనుక ఆంతర్యమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఆరోపణలు చేయడం, గనుల యజమానుల వద్ద ముడుపులు దండుకోవడం సోమిరెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా'

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను జిల్లాలో విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశమైన కలెక్టర్ 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలు అన్ని సచివాలయాల పరిధిలో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడల నిర్వహణకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ప్రక్రియ కూడా పూర్తి చేయడంతోపాటు క్రీడా మైదానాలను సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. క్రీడా వస్తువుల కిట్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడల నిర్వహణకు అవసరమైన సిబ్బంది కేటాయింపు ప్రక్రియ కూడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలన్నారు. క్రీడా మైదానాల్లో క్రీడాకారులకు అవసరమైన తాగునీరు, భోజన వసతితోపాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని ఈ క్రీడోత్సవాలను నిర్వహించాలని తెలిపారు. తొలుత జిల్లాలో క్రీడోత్సవాల నిర్వహణకు చేపడుతున్న చర్యలను నెల్లూరు నగరపాలక కమిషనర్ వికాస్ మర్మత్ వివరించారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, మైన్స్ డీడీ శ్రీనివాసరావు, సెట్నెల్ సీఈఓ నాగరాజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

• కలెక్టర్ హరినారాయణన్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట గడువు లోపు అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టి అర్జీలు పునరావృతం కాకుండా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఇచ్చిన అర్జీలు మళ్లీ మళ్లీ వస్తుంటే సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదో దరఖాస్తుదారుడికి అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. వరినాట్లు దెబ్బతిన్న రైతులకు జిల్లాలో వాతావరణానికి అనుకూలించే విత్తనాలు ఇవ్వాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ కూర్మనాథ్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవి, జిల్లా సర్వే అధికారి హనుమాన్ ప్రసాద్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు ఆర్థిక భరోసా



కలెక్టరేట్ నుంచి వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న జేసీ కూర్మనాథ్, యువ న్యాయవాదులు

- వైఎస్సార్ లా నేస్తంతో ప్రభుత్వం చేయూత
- జేసీ రోణంకి కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'వైఎస్సార్ లా నేస్తం' పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం యువ న్యాయవాదులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ లా నేస్తం ' పథకానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 2023 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల కాలానికి నెలకు రూ. 5 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది యువ న్యాయవాదుల ఖాతాల్లో రూ.7.99 కోట్లు జమ చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ప్రసాద్‌రావు, యువ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ లా కోర్సు పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ లా నేస్తం' కార్యక్రమం ద్వారా నెలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. యువ న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాక్టీస్‌లో బాగా రాణించాలని ఆకాంక్షించారు. 2023 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల కాలానికి జిల్లాలో 141 మంది యువ న్యాయవాదులకు రూ.42.30 లక్షలు జమ చేసినట్లు తెలిపారు. ఇంకనూ అర్హులైన యువ న్యాయవాదులు వైఎస్సార్ లా నేస్తం పథకానికి తమ పేర్లు నమోదు చేసుకోవాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లసిరి మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు టెండర్లు

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ నెల్లూరు జోన్-3 పరిధిలోని ఐదు జిల్లాల్లో ఉన్న 15 ఖాళీ స్థలాలను వ్యాపార నిమిత్తం 15 ఏళ్ల కాల వ్యవధితో లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 22న టెండర్లు పిలుస్తున్నట్లు జోన్-3 ఈడీ ఆదాం సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దకాకానిలో 2, దాచేపల్లి, సత్తెనపల్లి, ఇంకొల్లు, మార్టూరు, చీరాల, గిద్దలూరు, పామూరు, కొండేపి, సింగరాయకొండ, ఇంకొల్లు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, కాకుటూరులో ఒక్కొక్కటి చొప్పున ఖాళీ స్థలాలు ఉన్నాయని వివరించారు. 22న నెల్లూరు డిపోలోని ఈడీ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్ బాక్స్‌లు తెరిచి ఉంటాయని చెప్పారు. ఇందుకు సంబంధించి 13న డీపీటీఓ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ప్రజారవాణా సంస్థ వెబ్‌సైట్ www.aprrtc.ap.gov.inను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా భారతీయ భాషా ఉత్సవం



వెంకటాచలం: స్వాతంత్ర్య సమరయోధుడు, మహాకవి సుబ్రహ్మణ్యభారతి జయంతిని పురస్కరించుకుని మండలంలోని సరస్వతినగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో బహుభాషలు- ఒకే భావం అనే శీర్షిక పేరుతో భారతీయ భాషా ఉత్సవం-2023ను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సుబ్రహ్మణ్య భారతికి నివాళులర్పించి ఆయన సాహిత్య సేవలను స్మరించుకున్నారు. వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ప్రాచీన భాషల అధిపతి డాక్టర్ ఎల్ఆర్ ప్రేమ్‌కుమార్, కవి పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ టుడే సర్వేలో అదానీ స్కూల్ జిల్లా ఫస్ట్



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్

ముత్తుకూరు: 'ఎడ్యుకేషన్ టుడే' నిర్వహించిన సర్వేలో 2023 సంవత్సరానికి కృష్ణపట్నంపోర్టుకు చెందిన అదానీ వరల్డ్ స్కూల్ జిల్లాలో నంబర్-1 సీబీఎస్ఈ స్కూల్‌గా నిలిచింది. ఈ మేరకు ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ సోమవారం వివరాలను వెల్లడించారు. ప్రణాళికా బద్ధమైన బోధన, మౌలిక సదుపాయాలు, సమాజ సేవ, క్రీడల పట్ల శ్రద్ధ, సంపూర్ణ విద్య, విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోగా తమ స్కూల్‌కు ఈ గుర్తింపు లభించిందన్నారు. బెంగళూరులోని తాజ్ బెంగళూరు ఎయిర్‌పోర్టులో 'ఇండియా స్కూల్ మెరిట్ అవార్డు-2023' ప్రదానోత్సవంలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. పోర్టు సీఈఓ జీజే రావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వంగా పెన్నమ్మకు హారతి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆది దంపతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి పెన్నా నది వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. ఆది దంపతులను విశేషంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ గిరికృష్ణ, ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దివ్యాంగురాలి వద్దకు వచ్చి అర్జీని స్వీకరించి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ హరినారాయణ

సమస్యలు విని.. భరోసా కల్పించి

నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నుంచి దివ్యాంగులు తరలివచ్చారు. దివ్యాంగులను గమించిన జిల్లా అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తూ వారి వద్దకు లేచి వచ్చి వినతులను స్వీకరించారు. కలెక్టర్ హరినారాయణ, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో లవన్న దివ్యాంగుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి భరోసా కల్పించారు.



దివ్యాంగుడి నుంచి అర్జీని స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్



దివ్యాంగుడితో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఉత్తరకాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- సోమశిల ఉత్తరకాలువకు సాగునీటి విడుదల

సోమశిల : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు సాగునీటిని విడుదల చేశారు. తొలుత ఉత్తరకాలువ వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది మిచాంగ్ తుఫాన్‌కు ముందు తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సోమశిల జలాశయంలో 29 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయని తెలిపారు. దీంతో ఐఏబీ సమావేశంలో డెల్టాకు మాత్రమే నీటిని విడుదల చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. సోమశిల జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ మెట్టప్రాంత రైతుల పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 90శాతం రైతాంగం ఉండడంతో స్పందించిన సీఎం అన్నమయ్య ప్రాజెక్ట్, సోమశిల జలాశయం డెడ్ స్టోరీజీని తగ్గించి మూడు టీఎంసీలు అందించేందుకు అంగీకరించారని తెలిపారు. అదృష్టం కొద్ది మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు సోమశిలకు సుమారు 5 టీఎంసీలు వచ్చాయన్నారు. నీటి లభ్యత కారణంగా అన్నమయ్య ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల అవసరం లేకుండానే ఉత్తరకాలువ ద్వారా 3, దక్షిణకాలువ ద్వారా 1 టీఎంసీలు విడుదల చేస్తున్నామని వివరించారు. ఉత్తర, దక్షిణ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 45 వేల ఎకరాల్లో రైతాంగం సాగు చేపట్టనుందని తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ దఫా అధిక దిగుబడులు, అధిక ధరలు వస్తాయని నమ్మకం ఉందన్నారు. సాగునీటి వాడకం విషయంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, సాగునీటి వృథాను అరికట్టి అవసరమైన మేరకు మాత్రమే నీటిని విడుదల చేసేలా చూడాలని ఆదేశించామని తెలిపారు. ఉత్తరకాలువ ద్వారా ఏఎస్‌పేట వరకు, దక్షిణకాలువ ద్వారా చేజర్ల చివరి ఆయకట్టు వరకు సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సాగునీటిని వృథా చేయకుండా పంటలు పండించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటికి రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమశిల ఈఈ దశరథరామిరెడ్డి, అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సీనియర్ నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, పీర్ల పార్థసారథి, ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయళ్ల పద్మజారెడ్డి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలను వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకే తీసుకొచ్చారని తెలిపారు. పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీల సిఫార్సులతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు అత్యుత్తమ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు వినతుల వెల్లువ



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్):నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి 125మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డికి అందజేశారు. వాటిని నిశితంగా పరిశీలించిన ఆయన చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. న్యాయస్థానాల ఉత్తర్వులతో ముడిపడి ఉన్న అతి సున్నిత అంశాల్లో న్యాయనిపుణులు పర్యవేక్షణలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంక్‌ల్లో సబ్సిడీ లోన్లు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మోసగాళ్లు బరితెగిస్తున్నారని, ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం స్పందనకు వచ్చిన వారికి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్-2 డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, షఫీ, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసగించారు-రమేష్‌బాబు

నేను నగరంలోని మైపాడుగేటుసెంటర్ ప్రాంతంలోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. వారు బీటెక్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. బంగ్లాతోటకు చెందిన దుర్గాప్రసాద్‌రెడ్డి తనకు ఆర్టీసీలో ఉన్నతాధికారులతో పరిచయం ఉందని, అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి రూ.1.65లక్షలు తీసుకున్నారు. నమ్మకం కోసం ఓ సంస్థ పేరిట లెటర్‌ను ఇచ్చారు. నగదు తీసుకుని నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించలేదు. ఫోన్‌చేస్తే సరైన సమాధానం చెప్పేవాడుకాదు. గట్టిగా నిలదీయగా తనకు రాజకీయ పలుకుబడి ఉందని నీ అంతుచూస్తానని బెదిరిస్తున్నాడు. విచారించి న్యాయం చేయండి. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని నవాబుపేట పోలీసులను ఆదేశించారు.

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య



సంగం: ఏ కష్టమొచ్చిందో ఏమో తెలియదు కానీ పురుగు మందు తాగి గుర్తుతెలియని వృద్ధుడు(65) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. సంగంలోని కొండ సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వృద్ధుడు పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గమనించారు. సంగం పోలీసులకు సమాచారం అందజేయగా 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. వృద్ధుడు తెల్ల చొక్కా, పంచె ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో రూ.3వేలు నగదు, మందులు, నెల్లూరు నుంచి సంగం వచ్చినట్లుగా బస్సు టికెట్టు ఉండడాన్ని గుర్తించినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. వృద్ధుడి సమాచారం తెలిసిన వారు సంగం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రాంతీయ విద్యాకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చవటపాళెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ప్రాంతీయ విద్యా కేంద్రం భవన నిర్మాణానికి కలెక్టర్ ఎం హరినారాయణన్ సోమవారం స్థల పరిశీలన చేశారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించి ప్రాంతీయ విద్యాకేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ కేంద్రం భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని చవటపాళెంలో కలెక్టర్ పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. ప్రాంతీయ విద్యా కేంద్రం భవన నిర్మాణానికి అవసరమైన భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం నుంచి మంచి ధర ఇప్పిస్తామని తెలిపారు. విద్యాకేంద్రం ఏర్పాటుకు రైతులందరూ భూములు ఇచ్చి సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిమ్మధరలు



పొదలకూరు (కిలో)
పెద్దవి: రూ. 30
సన్నవి: రూ. 15
పండ్లు: రూ. 6

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.95	స్కిన్‌లెస్ చికెన్:	
లేయర్	రూ.90	రూ.196	
బ్రాయిలర్ చికెన్:	రూ.176	లేయర్ చికెన్:	రూ.170

సమష్టి కృషితో 48 గంటల్లోనే విద్యుత్ సరఫరా

- ప్రాణాలకు తెగించి పునరుద్ధరణ పనులు
- తుఫాన్‌లో విధులు నిర్వహించిన సిబ్బందికి ధన్యవాదాలు
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



జిల్లా విద్యుత్ అధికారికి అవార్డు అందజేసి అభినందిస్తున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించగలిగామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. 28 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. జిల్లా విద్యుత్ అధికారులు, సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడంతో 48 గంటల్లోనే గృహ, తాగునీటి సర్వీసులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగామని వివరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేసిన నెల్లూరుటౌన్ డివిజన్ విద్యుత్ అధికారుల బృందాన్ని అభినందించారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య, గూడూరు డివిజన్ నోడల్ అధికారి పరంధామయ్య, బెనర్జీల కృషితో ఒక్కరోజులోనే గూడూరుటౌన్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వగలిగామని తెలిపారు. నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేటలో రెండ్రోజులకు విద్యుత్ సరఫరా ఇవ్వగలిగామని చెప్పారు. వ్యవసాయానికి సంబంధించి ఇంకా కొన్నిప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉందని, త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లాకు వచ్చిన కర్నూలు జిల్లా ఎస్ఈ ఉమాపతి ఎంతో చొరవ చూపి తక్కువ వ్యవధిలోనే సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారని, ఆయనకు జిల్లా ప్రజలు ఎంతో రుణపడి ఉంటారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పూర్తి సహాయసహకారాలు అందించడంతోనే వేగంగా పునరుద్ధరణ పనులు పూర్తి చేయగలిగామన్నారు. విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించిన విద్యుత్ సిబ్బందిని సీఎం అభినందించారని తెలిపారు. విద్యుత్‌లైన్ల పునరుద్ధరణ పనుల్లో విద్యుత్ సిబ్బందికి వలంటీర్లు ఎంతగానో సహాయపడ్డారని, వారి సేవలు అమోఘమని కొనియాడారు. అనంతరం జిల్లా విద్యుత్ అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్‌మేనేజర్ గురవయ్య, ఓఎస్డీ శ్రీనివాస్, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, ఈఈలు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి వద్దకు వెళ్లొస్తుండగా..

- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్
- ద్విచక్ర వాహనచోదకుడు మృతి

కొడవలూరు: స్నేహితుడి వద్దకు వెళ్లి వస్తుండగా మోటార్‌సైకిల్‌ను ఎదురుగా పొట్టులోడు ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని గుండాలమ్మపాళెం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..కొడవలూరుకు చెందిన తలారి లక్ష్మీనారాయణ(45) విడవలూరు మండలం చౌకచర్లలోని స్నేహితుడి వద్దకు ఆదివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో తిరిగి కొడవలూరుకు బయలుదేరాడు. గుండాలమ్మపాళెం వద్ద ఎదురుగా వచ్చిన పొట్టు ట్రాక్టర్ ట్రాలీకి ఏర్పాటు చేసిన సవక కర్రలు తగలడంతో ద్విచక్ర వాహనంతో సహా కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ తలకు బలమైన గాయమైంది. పోలీసులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు కొడవలూరులో బ్యాంక్ సర్వీస్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన లక్ష్మీనారాయణ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.



లక్ష్మీనారాయణ మృతదేహం